క్లుప్తంగా

రాంగ్ రూట్‌లో వాహనాలు

● పొంచి ఉన్న ప్రమాదాలు



చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో రాంగ్ రూట్‌లో వెళ్తున్న టిప్పర్లు

చీమకుర్తి రూరల్: చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో రాంగ్ రూట్‌లో వాహనాలు ప్రయాణిస్తుండటంతో ప్రయాణికులకు డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి. ప్రధానంగా చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్లు, లారీలు బైపాస్ రోడ్డులో రెండు వైపులా వెళ్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనదారులు కాస్త ఆదమరిచినా ఊహించలేని ప్రమాదాలు జరుగుతాయి. అందువలన సంబంధిత అధికారులు ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మే 3న సంతనూతలపాడు మండల సమావేశం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మే 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహించనున్న ఈ సమావేశంలో మండల స్థాయిలో పలు రంగాల అభ్యున్నతిపై ఆయా శాఖల అధికారుల పర్యవేక్షణలో సమీక్షించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాల్సిందిగా కోరారు.

చిన్నకండ్లేరు ప్రాజెక్టు సాధనకు కదలి రావాలి

● పోస్టుకార్డు ఉద్యమంలో రైతులు



పోస్టుకార్డు ఉద్యమంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

పుల్లలచెరువు: పుల్లలచెరువులో ఉన్న చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, దాని సాధన కోసం రైతులంతా కదలి రావాలని తీగలేరు సాధన సమితి కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాచకొండలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఉద్యమ నాయకులు రాములు, రఘు మాట్లాడుతూ మండలంలో సాగు,తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇటీవల పుల్లలచెరువు మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రకటించిందంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సంవత్సరాల కాలంలో వెలుగొండ ప్రాజెక్టును ఏర్పాటు చేసి ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి వచ్చే టీ5 కాలువను చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. రైతులు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షుడు రఘు, వెంకటరెడ్డి, కోటిరెడ్డి, బంగారురెడ్డి, యల్లారెడ్డి, ఎరుకలయ్య, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి పార్టీలో పదవులిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల స్థాయి కమిటీలలో పదవులు పొందిన ఆ పార్టీ నాయకులు సోమవారం చీమకుర్తిలోని పార్టీ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా యన్నం శేషురెడ్డి, చీదర్ల శేషు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా కుంచాల రాంబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పల్లాపల్లి గోపి పదవులు పొందగా, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కలిసి శాలువాలు, పూలదండలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ పదవులు పొందిన వారంతా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాయకులు గంగిరెడ్డి ఓబులరెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, హరీష్, జి.నరసింహారావు, బక్కా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చుండూరి రవిబాబును కలిసిన పాలడుగు రాజీవ్



చుండూరి రవిబాబును సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న రాజీవ్

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ సోమవారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రవిబాబును శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం కష్టపడాలని రాజీవ్‌కు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షపై శిక్షణ కార్యక్రమం



గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి రమేష్

మద్దిపాడు: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో మట్టి పరీక్షల నిర్వహణకు సోమవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి కే రమేష్ పాల్గొని మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షల నమూనాలు సేకరించే విధానంపై శిక్షణ ఇచ్చారు. రైతులు తమ పొలంలో పోషక విలువలు తెలుసుకోవడం వలన వేసిన పంటకు ఏ పోషకాలు ఎంత మోతాదులో అవసరమో తెలుసుకుని తగిన మోతాదులో ఎరువులు వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి పొందవచ్చని వివరించారు. ప్రతి రైతు గ్రామ రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షల యాప్లో నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత పొలంలో రైతుతో పాటు నమూనా తీసే ప్రదేశాన్ని ఫొటో తీసుకోవాలని సూచించారు. మట్టి నమూనా తీసే క్రమంలో గతంలో ఆ పొలంలో వేసిన పంట గురించి, రాబోయే కాలంలో వేసే పంట గురించి యాప్లో నమోదు చేయాలన్నారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ సంవత్సరం 18 రైతు సేవా కేంద్రాల్లో 990 మట్టి నమూనాలు సేకరించడానికి ప్రణాళిక రూపొందించినట్లు వ్యవసాయశాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై ఇచ్చే సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, జిప్సం వంటివాటిని భూసార పరీక్షల ఫలితాల పత్రం ఆధారంగా రైతులకు సబ్సిడీపై అందించనున్నట్లు రమేష్ తెలిపారు.

డ్రగ్స్ రహిత ప్రాంగణంగా ఏకేయూ



యాంటీ డ్రగ్స్ దినోత్సవంలో నినాదాలు చేస్తున్న ఏకేయూ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

ఒంగోలు సిటీ: సమాజాన్ని, ముఖ్యంగా యువతను చెడుమార్గంలో పయనింపజేస్తున్న డ్రగ్స్ వినియోగంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ (ఏకేయూ) కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ గుత్తి రాజమోహన్‌రావు సూచించారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్శిటీని డ్రగ్స్ రహిత విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు తదితరుల సూచనల మేరకు ఏకేయూ కళాశాల ప్రాంగణంలో సోమవారం యాంటీ డ్రగ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు మాట్లాడుతూ వ్యవస్థల్లోనూ, విద్యా సంస్థల్లోనూ వెలుగు చూడకుండా అనేక విషయాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అలాంటి వాటిలో యాంటీ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు, మనో విజ్ఞాన వైద్యులు చెబుతున్న విషయాలను దృష్టిలో ఉంచుకుని డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. సరదాగా ప్రారంభమయ్యే డ్రగ్స్ వినియోగం అనేది చివరకు జీవితాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం, ర్యాగింగ్ లేని విశ్వవిద్యాలయంగా ఆంధ్రకేసరి యూనివర్శిటీని నేటి సమాజంలో నిలిపేందుకు విద్యార్థులతో పాటు ఏకేయూలో పనిచేసే ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా, సమిష్టి కృషితో పనిచేయాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ పిలుపునిచ్చారు. పశ్చాత్తాపాన్ని మించిన శిక్ష నేటి సమాజంలో మరొకటి లేదన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ భవిష్యత్తులో పశ్చాత్తాపానికి గురికాకుండా వ్యక్తిగతమైన శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డ్రగ్స్ భూతాన్ని మొగ్గ దశలోనే తుంచివేయాలంటూ విద్యార్థులతో నినాదాలు చేయించారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి: ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.రామకృష్ణయ్య కోరారు. సోమవారం చీమకుర్తిలోని యూటీఎఫ్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్యాచ్‌కు 25 మంది చొప్పున మొత్తం 90 మందికి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఇంకా ఎవరైనా ఉంటే తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎన్ఆర్ఈజీఎస్ నూతన భవనంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రారంభించారు. ప్రభుత్వం ఉచితంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. 142 మంది మహిళలను రెండు బ్యాచ్‌లుగా విభజించి మూడు నెలల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు తమ జీవనోపాధి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు సర్పంచి దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, టైలరింగ్ శిక్షణ జిల్లా రిసోర్స్ పర్సన్ వెంకటరత్నం, మండల పరిషత్ సిబ్బంది, శిక్షణ పొందనున్న మహిళలు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో టైలరింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే బూచేపల్లి విస్తృత పర్యటన



లంకోజనపల్లిలో క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి



డాక్టర్ జమాల్ నాయక్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి

● ప్రమాద బాధితులకు పరామర్శ

దర్శి (కురిచేడు): ఇటీవల పలు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను, అనారోగ్యానికి గురైన పార్టీ కార్యకర్తలు, నాయకులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలో విస్తృత పర్యటన చేసి అందరికీ తానున్నానంటూ భరోసా కల్పించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్‌కు చెందిన పార్టీ నాయకులు మస్తాన్ వలి కుమారుడు రఫీ ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి వారి ఇంటికి వెళ్లి రఫీ ఆరోగ్యానికి సంబంధించిన వైద్య పరీక్షల రిపోర్టులు పరిశీలించారు. చికిత్స అందించిన వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దేవవరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవనాసి చిన్న ఏసును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలపై నాయకులతో చర్చించారు. కట్టుబడివారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త తేళ్ల జేమ్స్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని జాగ్రత్తలు తెలిపారు. ప్రముఖ హోమియో వైద్యుడు, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తండ్రి డాక్టర్ జమాల్ నాయక్‌ను వెంకటాచలంపల్లిలోని ఆయన గృహంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. లింగన్నపాలెంలో ఎంపీటీసీ తండ్రి బండి గోపాల్‌రెడ్డి దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో గాయపడిన గ్రామ నాయకుడు బండి కృష్ణారెడ్డిని పరామర్శించారు. మండలంలోని లంకోజనపల్లిలో సర్పంచ్ కొరివి కోటయ్య భార్య దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద కూలీల ఆటో ప్రమాదంలో గాయపడిన లంకోజనపల్లి గ్రామానికి చెందిన కూలీలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు కొరివి మునలయ్య, సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, నలదిమ్ము రమణారెడ్డి, కాసు కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల నివాళులు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: మండలంలోని యల్లయ్యనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దివంగత జట్రాజుపల్లి సాల్మన్ భార్య వెంకటమ్మ సోమవారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, నాయకులు జట్రాజుపల్లి యాకోబు, బిరుదుల లింగయ్య, తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

పెద్దారవీడు: భూమిలో సేంద్రియ ఎరువులు వాడి సమగ్ర పోషక యాజమాన్యం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కె.బుజ్జిబాయి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పచ్చిరొట్టల సాగుపై గ్రామ వ్యవసాయ సహాయకులకు సోమవారం అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పచ్చి రొట్ట పైర్లను సాగు చేసే విధంగా రైతులకు చెప్పాలన్నారు. వేసవిలో త్వరగా పెరిగే పప్పుజాతి పైర్లు జనుము, జీలుగు, పెసర, పిల్లి పెసర, అలసంద విత్తనాలు సాగు చేసుకోవాలన్నారు. ఇప్పుడు సాగు చేసుకున్న పచ్చిరొట్ట పంటను జూలై, ఆగస్టు మాసాల్లో పొలంలో కలియదున్నాలని చెప్పారు. వీటి పైర్లపై ఉంటే రైజోబియం బ్యాక్టీరియా గాలి నుంచి నత్రజనిని గ్రహించి మొక్కలకు అందిస్తే మొక్క పెరుగుదలతో పాటు నేల సారం కూడా పెరుగుతుందన్నారు. ఆ పైరును పొలంలో దున్నినప్పుడు చీకిన పదార్థం నేలలో కలిసి నేల గుల్ల బారడంతో నీరు ఎక్కువగా ఇంకుతుందన్నారు. సాగు చేసిన పంటలకు అధిక దిగుబడుల కోసం విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడి భూసారం దెబ్బతిని సూక్ష్మపోషక పదార్థాల లక్ష్యత క్షీణించి భూములు పాలచౌడు, కారు చౌడు నేలలుగా మారుతాయని రైతులకు తెలియజేయాలన్నారు. మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మే 25న హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర కరపత్రాలు, క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని మే 25వ తేదీ ఒంగోలులో ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు తెలిపారు. సంబంధిత కరపత్రాలు, క్యూ ఆర్ కోడ్‌ను సోమవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. క్యూ ఆర్ కోడ్‌ను దామచర్ల స్కాన్ చేసి తన పేరును తొలిగా నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి ఇనమనమెళ్లూరి సీతారామయ్య, భజరంగ్‌దళ్ విభాగ్ కార్యదర్శి యక్కిటీల పిచ్చయ్య చౌదరి, ఒంగోలు జిల్లా కార్యదర్శి ఈమని బలరాం, త్రిపుర భైరవేశ్వరానందస్వామి, ప్రచార ప్రముఖ్ రాధా రమణ గుప్తా జంధ్యం, మఠంపల్లి దుర్గాఆదిశేషు, అంకిరెడ్డి, రాజేష్‌వర్మ, వెన్నెల సుబ్బారావు, సుదర్శన్, రామకోటిరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఇబ్బంది లేకుండా చూడాలి

● ఇంటర్ విద్య ఆర్‌జేడీని కలిసిన కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ ప్రతినిధులు



ఆర్జేడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ నాయకులు

ఒంగోలు సిటీ: ఇంటర్ విద్య జోన్–3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు) ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జగన్నాథం పద్మను జిల్లాకు చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ నాయకులు సోమవారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రేషనలైజేషన్, బదిలీలు చేపట్టనున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. సర్వీస్ డిస్టర్బ్ అయిన వెంటనే జాప్యం లేకుండా సర్దుబాటు చేయాలని కోరారు. ఆగిపోయిన రెగ్యులరైజేషన్ పునరుద్ధరణ అంశం, ఇతరత్రా కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారంలో తమ పట్ల సానుభూతి చూపాలని కోరారు. ఆర్జేడీని కలిసిన వారిలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-చైర్మన్ కల్లూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సైదులు, జాయింట్ సెక్రటరీ బుల్లా వీరయ్య తదితరులు ఉన్నారు.

2న శంకర జయంతి సందర్భంగా శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: జగద్గురువులు ఆదిశంకరాచార్యులు జయంతి సందర్భంగా మే 2వ తేదీ ఒంగోలులోని కేశవస్వామిపేటలోని లలితాశ్రమం నుంచి వేద విద్యార్థులు, వేద పండితులతో ఆదిశంకరుల చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీ వేదస్మార్త ప్రవర్తక విద్వత్ పరీక్షా పరిషత్ సెక్రటరీ మహంకాళి శేషయ్య తెలిపారు. కేశవస్వామిపేటలోని లలితాశ్రమంలో సోమవారం ఉదయం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. వేదం శివ స్వరూపమని, వేదమే శివుడు.. శివుడే వేదంగా భావించి వేదాన్ని పరిరక్షించుకోవడం ద్వారా ఇటు పదితరాలు, అటు పదితరాల వంశస్తులు స్వర్గానికి వెళతారని ప్రముఖ వేదపండితులు వేద వశిష్ట తెలిపారు. ఉపాధ్యక్షుడు గుడ్లదొన మురళీకృష్ణ మాట్లాడుతూ మే 2, 3 తేదీల్లో వేద సభలను ఒంగోలు కేశవస్వామిపేటలోని శివాలయం ఎదురుగా గల శ్రీ లలితా జ్ఞానపీఠం (లలితాశ్రమం)లో ప్రముఖ వేద పండితులు వంగల కృష్ణమూర్తి అవధాని, పిన్నెల్లి చంద్రశేఖర్ అవధాని ఆధ్వర్యంలో వేద విద్యార్థులకు వేద పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సలహాదారులు ఆలూరి రామారావు, పురోహితులు భారతుల శ్రీనివాసశాస్త్రి, సభ్యులు, కాలభైరవ ఉపాసకులు మైనంపాటి సాయికుమార్, ఓరుగంటి ప్రసాద్ పాల్గొన్నారు.